

ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డులు చూపాలి: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : సార్వత్రిక ఎన్నికలు - 2024లో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన సమయంలో ఓటర్లు ఓటరు గుర్తింపు కార్డులు చూపాలని లేదంటే ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డు చూపి ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్ షన్మోహన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎపిక్ కార్డు లేని వారు ప్రత్యామ్నా యంగా ఫొటో గుర్తిం పు కార్డులను చూపించి ఓటు వేయవచ్చన్నారు. ఎలక్షన్ కమిషన్ 1993 ఆగస్టు 28వతేదీన ఎలక్టర్ల ఫొటో ఐడెంటిటీ కార్డ్ (ఇపిఐసి) ఎలక్టర్లందరికీ జారీ చేయాలని నిర్దేశిస్తూ ఆదేశించా మన్నారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల ప్రకారం దేశంలోని దాదాపు 100 శాతం ఓటర్లకు ఎలక్టర్ల ఫొటో గుర్తింపు కార్డులు జారీ చేశామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇపిఐసి జారీ చేసిన ఓటర్లు తమ ఓటు వేసే ముందు తమ గుర్తింపు కోసం ఇపిఐసిని పోలింగ్ కేంద్రాలలో చూపించి ఓటు వేయాలన్నారు. ఇపిఐసి లభ్యంగా లేని ఓటర్లు ప్రత్యామ్నాయంగా ఆధార్ కార్డ్, ఉపాధి జాబ్ కార్డ్, బ్యాంక్, పోస్టాఫీసు జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్‌లు, ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, తదితర ఫొటో గుర్తింపు కార్డులు చూపి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని కలెక్టర్ సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు

ప్రకృతి వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ ఏర్పాటు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : జిల్లాలో అగ్రికల్చర్ డిపార్టుమెంట్లో ప్రకృతి వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం చిత్తూరులో జిల్లాలోని కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ ఏర్పాటు చేసుకొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వాడ గంగరాజు మాట్లాడుతూ గత 14 నెలలుగా వేతన బకాయిలు వుండడంతో వారి కుటుంబ పరిస్థితి దుర్భరంగా మారిందని వారికి వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు. క్షేత్ర స్థాయిలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై చైతన్యం కలిగిస్తూ వారు పండించే పంటలకు ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో చేయించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఇలాంటి వారికి తీవ్ర సమస్యలు వున్నాయని వారి సమస్యలపై భవిష్యత్తులో వేతనాలు పెంపు కోసం, ఉపాధి కోసం అందరూ ఐక్యంగా యూనియన్ ఏర్పాటు చేసుకున్నారన్నారు. దేశ వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమస్యలపై నిరంతరం సిఐటియు చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై సిఐటియులో చేరామని కార్మికులు తెలిపారు.



గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు | అధ్యక్షులు నాగరాజు | కార్యదర్శి రాజాప్రతాప్ | కోశాధికారి హనుమంతురెడ్డి

నూతన కమిటీ ఎన్నిక

నేచురల్ ఫార్మింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధంగా చిత్తూరు జిల్లాలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా వాడ గంగరాజు, అధ్యక్షులుగా నాగరాజు, కార్యదర్శిగా ప్రతాప్, కోశాధికారిగా హనుమంత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా భారతి , నీలకంఠ రెడ్డి, మురళి, ఓబులేష్, సహాయ కార్యదర్శులుగా రమేష్ , రూప, చంద్రయ్య, రెడ్డమ్మ లతోపాటు 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ప్రయాణంలో ఇంటి భోజనం

● ప్రతి స్టేషన్‌లోనూ ముందస్తు ఆర్డర్‌తో సిద్ధం ● కొత్త వ్యాపారానికి మంచి ఆదరణ

ప్రజాశక్తి- తిరుపతి సిటి

సుదూర ప్రాంతం ప్రయాణించే ప్రయాణికులకు ముందస్తు ప్లానింగ్ లేకపోవడం, సరైన సమయం దొరకపోవడం, ఇతరాత్ర కారణాలతో ఆహారాన్ని తెచ్చుకోలేక, అలాగని రైల్వేస్టేషన్, బస్టాండుల్లో దొరికే నాణ్యత, రుచి, పచిలేని ఆహారాన్ని తినలేక అనేక మంది వస్తులతో ప్రయాణం చేస్తుండడం సరామామూలే. అలా ఇబ్బంది పడే ప్రయాణికులకు ఇంటి భోజనాన్ని రుచి, శుచిగా, తాజాగా అందించాలనే ఉద్దేశ్యంతో రూపుదిద్దుకొంది. ప్రయాణంలో ఇంటి భోజనం కాన్సెప్ట్. ఏయే ప్రాంతంలో ఎన్ని గంటలకు, ఎంత మందికి భోజనం కావాలో ముందస్తుగా ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే చాలు. వారు ఆ స్టేషన్‌కు చేరుకునేసరికి తాజా భోజనం వారి చెంతకు చేరుతుంది. కొత్త వ్యాపారానికి ప్రయాణికులు ముగ్ధులు కావడంతో ఆదరణ పెరిగి, దినదినాభివృద్ధి చెందుతుండడం గమనార్హం.

2019లో ప్రపంచాన్ని వణికించిన కరోనా వల్ల చాలా మందికి అనేక ఇబ్బందులు తప్పలేదు. చాలా ఇళ్లల్లో ఇల్లాలు కరోనా భారిన పడడంతో ఆ ఇంటి వారికి ఆహార సమస్య తలెత్తింది. కొన్ని ప్రాంతాల్లో ఆసుపత్రిలో, క్వారెంటైన్‌లో ఉండే వారికి కూడా సరైన ఆహారం దొరకడం కష్టంగా మారింది. తిరుపతి ఆధ్యాత్మిక ప్రాంతంలో విష్ణునివాసం, శ్రీనివాస కాంప్లెక్స్, తిరుచానూరు పద్మావతి నిలయంలో ఉండే వారికి టిటిడి, చంద్రగిరి ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు ఆహార సరఫరా చేశారు. మిగిలిన ప్రాంతాల్లో ఉన్న వారికి ఆహారం దొరక్క ఇబ్బంది పడ్డారు. సరిగ్గా అదే సమయంలో తిరుపతికి చెందిన లక్ష్మీకి ఓ సరికొత్త ఆలోచన వచ్చింది. బోజనం కోసం ఇబ్బంది పడుతున్న వారికి పౌష్టికాహారాన్ని సరఫరా చేయాలని తలిచింది. అనుకున్నదే తడువుగా వెనువెంటనే శ్రీబ్రాహ్మణ కర్రీపాయింట్‌ను స్థాపించిపంది. 99598 59227 ఫోన్ నెంబరుకు ఆర్డరు ఇస్తే చాలు తిరుపతి, పరిసరాల ప్రాంతాల్లో ఎక్కడికైన వీలైనంత తక్కువ సమయంలో శుచి, రుచి కల్గిన ఆకు కూరలు, కూరలు, వేపుళ్లు (కర్రీస్) సరఫరా చేసేది. ఒక పక్క కరోనో విజృంభిస్తున్న లెక్క చేయకుండా పది మందికి పౌష్టికాహారం ఇవ్వాలని తలిచి, బోజన సరఫరాను కూడా ప్రారంభించింది. ప్రతి రోజు వందలాది మందికి బోజనం అందించేది. ఒక పక్క కరోనా బాధితులకు పౌష్టికాహారం ఇస్తూనే, మరో పక్క వ్యాపార పరంగా కుటుంబ పోషణనకు బాటలు వేసింది. భర్త, పిల్లలు, కుటుంబ సభ్యులు సహకరించడంతో వ్యాపారం జోరందుకుంది. కొన్ని రోజులకు రాను రాను



కరోనా తగు ముఖం పట్టింది. లాక్‌డౌన్లు దశల వారీగా సడలించారు. దీంతో ఆమె కర్రీస్ పాయింట్‌కు ఆర్డర్లు తగ్గు ముఖం పట్టాయి. అయిన ఆమె అధైర్యపడకుండా కర్రీస్ పాయింట్‌తో పాటు క్యాటరింగ్‌ను ప్రారంభించింది. ఇళ్లల్లో జరిగే అన్ని రకాల శుభకార్యాలకి, గృహప్రవేశాలకు, పెళ్లిళ్లకు, నోములు, వ్రతాలు, కిట్టి పార్టీలకు, బ్రహ్మణ బోజనాన్ని కోరిన విధంగా క్యాటరింగ్ పద్ధతిలో అందించేంది. దేవాలయాలకు మడిగా ప్రసాదాలు అందజేయడం వీరి ప్రత్యేకత. ఆ నేపథ్యంలో ఆమెకు మరో కొత్త ఆలోచన పుట్టుకొచ్చింది.

తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో దేశ నలుమూలల్లోని సుదూర ప్రాంతాల నుంచి రకరకాల ప్రాంతాలకు చెందిన వారు తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వస్తుంటారు. తిరుపతికి ప్రతి రోజు లక్ష మంది యాత్రికులు రాకపోకలు సాగిస్తున్నారు. తిరుపతికి వచ్చే వారిలో అధిక మంది హోటల్ పుడ్ పట్టక, సరైన, నాణ్యమైన భోజనం అందక ఇబ్బంది పడుతున్నారని గమనించి, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి తాజా, శుచి, రుచికరమైన బ్రాహ్మణ పద్ధతిలో శాఖహార బోజనాన్ని అందించాలని భావించింది. తిరుపతి మీదగా ప్రయాణించే వారు ముందస్తుగా తమ ఫోన్‌కు సమాచారం ఇచ్చి, ఏ సమయానికి, ఎక్కడికి, ఎంత మందికి భోజనం కావాలో తెలియజేస్తే చాలా ఆ సమయానికి అక్కడికి తాజా పౌష్టికాహారాన్ని అందించేలా వ్యాపారాన్ని ప్రారంభించింది. దీనికి ఆదరణ దక్కడంతో విజయవాడ, గుంటూరు, విశాఖపట్టణం నుంచి స్థానిక వ్యాపారులు వీరిని సంప్రదించి, బ్రాంచిలను ఏర్పాటు చేశారు. ప్రయాణ భోజనం సరఫరా ప్రచారం అందరికీ చేరడంతో అటు ప్రయాణికులు, ఇటు వ్యాపారులు ఆయా ప్రాంతాల వారిని సంప్రదించడం పెరిగింది. దీంతో లక్ష్మిని ఫోన్ ద్వారా సంప్రదించిన వారికి ఆయా స్టేషన్‌లో బోజనం సరఫరా ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రస్తుతం విజయవాడ, బెంగుళూరు, సికింద్రాబాద్, విశాఖపట్టణం (వైజాగ్), కాకినాడ, తిరుపతి, న్యూఢిల్లీ, చెన్నయ్ తాంబరం, రాజమండ్రి, నెల్లూరు, వారణాసి, షిర్డి, ఒరిస్సా, గుంటూరు, అరుణాచలం, ఏలూరు, ఒంగోలు ప్రాంతాల్లో ఆంధ్ర బ్రాహ్మణ భోజనాన్ని ప్రయాణీకులకు చేరువేస్తున్నారు. రైలు, బస్సు, కారు, ఇతర వాహనాల్లో వచ్చే వారికి కూడా ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. తిరుపతి కేంద్రంగా జరుగుతున్న ఈ వ్యాపారం ద్వారా లక్ష్మీ ప్రతి రోజు రూ.1000 నుంచి 1500ల వరకు ఆదాయాన్ని అర్జిస్తుంది. వారాంతపు రోజుల్లో (వీకెండ్ డేస్‌లు) రోజుకు 3వేల రూపాయలకు వరకు ఆదాయం సంపాదిస్తుంది. ప్రస్తుతం పిల్లల పరీక్షల సమయం కావడంతో ఆ మాత్రం వ్యాపారం, ఏప్రిల్‌లో సెలువులు ప్రారంభమైతే ప్రయాణికులు తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో రోజుకు రూ.3 నుంచి 4వేల వరకు, నెలకు రూ.లక్షా 50వేల వరకు ఆదాయం వస్తుంది. ఈ సరికొత్త వ్యాపారానికి ఆదారణ పెరుగుతుండడం గమనార్హం.

సేవతో పాటు ఆదాయం కూడా..



ప్రయాణికులు ఇంటి భోజనం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆహార సరఫరా వ్యవస్థ ద్వారా ప్రయాణికులు అనుకున్న సమయానికి, అనుకున్న ప్రాంతానికి తాజా, రుచికరమైన భోజనాన్ని అందిస్తు సేవ చేస్తూ, వారి మన్నలను పొందుతున్నాం. ఇది ఆత్మసంతృప్తిని ఇస్తుంది. ఇంకో పక్క వ్యాపార పరంగా ఆదాయం వస్తుండడంతో కుటుంబ పోషణ కూడా బాగా ఉంది.

- లక్ష్మీ, బ్రాహ్మణ భోజనం క్యాటరింగ్ అధినేత, తిరుపతి



ముఖ్యమంత్రి పర్యటన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

3న ముఖ్యమంత్రి పర్యటన

స్థలాన్ని పరిశీలించిన మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు మండల పరిధిలోని మూర్తిగనూరు సమీపంలో ఈ నెల 3వ తేదీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సభ నిర్వహించనున్నారు. సభకు సంబంధించిన స్థలాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పరిశీలించారు. జాతీయ రహదారి పక్కన స్థల ప్రాంగణం ఉన్నందున ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు సూచించారు. ఆయన వెంట ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్, నాయకులు మోహన్ రెడ్డి, పూతలపట్టు జగదీశ్వర్ రెడ్డి, కుమార్ రాజా, శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులనూ వదలని దొంగలు

- స్టాటర్, మోటారు కేబుల్ వైరు అపహరణ -రైతుల గుండెల్లో గుబులు



రైతుల పొలాల్లో స్టాటర్లు, కేబుల్ వైరు అపహరించుకుని వెళ్లిన దొంగలు

ప్రజాశక్తి - వెదురుకుప్పం: దొంగలు రైతులనూ సైతం వదలడం లేదు. రైతుల పొలాల్లో పడి మోటార్ల స్టాటర్లు, వైర్లు అపహరించు కుని వెళుతున్నారు. ఈ కారణంగా రైతులు భయాందో ళనకు గురవుతున్నారు. వెదురుకుప్పం మండలం నల్ల వెంగణం పల్లి పంచాయతీ కలిమి చేనులో రైతు పొలా ల్లో గుర్తు తెలియని దుండగులు స్టార్టర్, 600 మీటర్ల మోటార్ కేబుల్ వైర్లను శనివారం రాత్రి కట్ చేసి దోచుకెళ్లారు. కలిమి చేను రైతులు కె చిన్నబ్బారెడ్డి, కే రామిరెడ్డి, ఎం నారాయణరెడ్డి, ఎం భాస్కర్ రెడ్డి ఈ విషయాన్ని ఆదివారం మీడియాకు తెలిపారు. గ్రామ బోర్లు వద్ద దొంగలు విలువైన సామగ్రిని దోచుకెళ్లారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.



రోడ్డును దాటుతున్న ఒంటరి ఏనుగు

రోడ్డు దాటడానికి ఒంటరి ఏనుగు తంటాలు

ప్రజాశక్తి - పలమనేరు:

చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పలమనేరు మండలం గంటా ఊరు వద్ద శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఓ ఒంటరి ఏనుగు రోడ్డు దాటడానికి తంటాలు పడింది. అటుగా వెళుతున్న వాహన దారులు ఏనుగును రోడ్డు దాటడానికి ప్రయత్నిస్తుంటే సెల్ఫీలు వీడియోలు తీశారు. చిత్తూరు నుండి పలమనేరు వెళ్లే వాహనాలు తాకిడి ఎక్కువగా ఉండడంతో ఏనుగు ఇటువైపు అటవీ ప్రాంతం నుండి అటువైపు

సెల్ఫీలు తీసుకున్న ప్రయాణికులు

వెళ్లడానికి ఎంతో యత్నించి చివరికి వాహనాలు అటూ ఇటూ ఎక్కువగా వెళుతుండడం వల్ల ఒంటరి ఏనుగు వెనుదిరిగింది. ఏనుగు రోడ్డుపై ఉన్నంతసేపు అటవీ అధికారులు అటువైపు రాలేదని, ఆహారం కోసం ఏనుగులు సుదీర్ఘ ప్రయాణాలు చేస్తుంటాయి. అలాంటిది కనీసం ఒకరిద్దరు ట్రాకర్స్ అయినా పెట్టి గజరాజును రోడ్డు దాటించి ఉంటే బాగుండేదని చర్చించుకున్నారు.

నవోదయకు కొలమడుగు పాఠశాల విద్యార్థి

ప్రజాశక్తి -శాంతిపురం :

నవోదయ పాఠశాలలో ఎంపిక కోసం కేంద్రం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పరీక్షలలో మండల పరిధిలోని కొలమడుగు గ్రామానికి చెందిన సి.చేతన్ గౌడ్ ఉత్తీర్ణత సాధించాడు. 2024 - 2025 సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన నవోదయ దేశ వ్యాప్త పరీక్షల్లో ఆ గ్రామానికి చెందిన చింతమాని చంద్రశేఖర్ రెండో



నవోదయకు ఎంపికైన చేతన్ గౌడ్

కుమారుడు 'చింతమాని చేతన్ గౌడ్' ఉత్తీర్ణుడయ్యాడు. కాగా ఈ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన చేతన్ గౌడ్ తల్లి దండ్రులు పట్ట భద్రులు, ఈ విద్యార్థి కొలమడుగు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ఆ పాఠశాల ఉపాధ్యా యులు, గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

కాంగ్రెస్ యువనేత శివశంకర్



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి -వి కోట : రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుందని పలమనేరు నియోజకవర్గ కాంగ్రెస్ ఆశావహ అభ్యర్థి శివశంకర్ తెలిపారు. మండల పరిధిలోని నెర్నిపల్లి గ్రామ పంచాయతీలో ఆదివారం వారు కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ వెళ్లి కాంగ్రెస్ ప్రకటించిన ఎన్నికల హామీలను తెలిపి ఓట్లు అభ్యర్థించారు. పలమనేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. వీరి వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇనయతుల్లాఖాన్, భాస్కర్ రెడ్డి, గురివిరెడ్డి, శివన్న , నాగరాజు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఇద్దరు వ్యక్తుల అరెస్టు

ప్రజాశక్తి -వి కోట : మండల పరిధిలో కర్ణాటక మద్యంను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి ఒక మోటార్ సైకిల్‌తో సహా ఆరు కేసుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ మద్యం, డబ్బుపై ఉక్కుపాదం మోపాలని ఎస్‌పి జాషువా ఇచ్చిన ఆదేశాల మేరకు పలమనేరు, డిఎస్‌పి మహేశ్వర రెడ్డి సూచనల ప్రకారం వికోట మండలంలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం కరిప్పల్లి గ్రామ సమీపంలోని హంద్రీ-నీవా కాలువ వద్దకు ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌లో కర్నాటక నుండి అక్రమ మద్యంను తీసుకొని వెళుతున్నారని అందిన ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ లింగప్ప, సిబ్బందితో కలిసి వి కోట పట్టణ సరిహద్దు కర్ణాటక బార్డర్ నుండి కరిప్పల్లి మీదుగా అడ్డ దార్లలో ఏడుచుట్లకోట గ్రామానికి వెళుతున్న వి కోట మండలం ముదరందొడ్డి పంచాయతీ ఏడుచుట్లకోట గ్రామానికి చెందిన రవి కుమారుడు రాజు, దేవరాజు కుమారుడు జగదేవను అదుపులోకి తీసుకుని వారివద్ద ఉన్న రెండు పాలిథిన్ సంచులలో ఉంచిన కర్ణాటకకు చెందిన 90 యంయల్ 6 కేసులు మొత్తం 576 టెట్రా ప్యాకెట్లతో సహా ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. వారిద్దరిపై ఎక్సైజ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెండింగ్ కేసులు వేగవంతంగా పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ భీమారావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :

జిల్లాలో వివిధ కోర్టులలో పెండింగ్ లో ఉన్న సివిల్, క్రిమినల్ అన్ని రకాల కేసులను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ భీమారావు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం జెడ్పీ మీటింగ్ హాలులో అడ్మినిస్ట్రేషన్, సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారానికి సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జ్యూడిషియల్ ఆఫీసర్స్‌కు నిర్వహించిన కాన్ఫరెన్స్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ కోర్టులలో పెండింగ్ లో ఉన్న వివిధ రకాల సివిల్, క్రిమినల్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని సంబంధిత జ్యూడిషియల్ ఆఫీసర్స్‌ను ఆదేశించారు. హై కోర్టు ఆదేశాల మేరకు జిల్లా జ్యూడిషల్ అధికారులతో సమావేశాన్ని జిల్లా కేంద్రంలో మూడు నెలలకు ఓ సారి నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 63 కోర్టులు పనిచేస్తున్నాయని, వీటిలో ఒక ప్రిన్సిపల్ జిల్లా కోర్టు, 14 అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జిల కోర్టులు, 11 సీనియర్ సివిల్ జడ్జిల కోర్టులు, 33 జూనియర్ సివిల్ జడ్జిల కోర్టులు, 4 స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులు ఉన్నాయని తెలిపారు. 28 ఫిబ్రవరి 2024 నాటికి జిల్లాలో 91,221 వివిధ రకాల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో 46,938 సివిల్ కేసులు, 44,283 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 91,221 నుండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమారావు

90,652 గత జ్యూడీషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ నుండి ప్రస్తుత జ్యూడీషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ వరకు 569 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. భూములకు సంబంధించి, క్రిమినల్ కేసులకు సంబంధించి రెవెన్యూ, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకొని వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత కేసుల పరిష్కారానికి కలెక్టర్, సంబంధిత అధికారులతో కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించామని తెలిపారు. జిల్లాలో కొత్త 15 కోర్టుల బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి హైకోర్టు అనుమతి ఇచ్చిందన్నారు. ఈ భనాల నిర్మాణం, లిఫ్ట్ పనులు , ల్యాండ్ స్కేపింగ్ పనులు మినహా పూర్తయిందని, మిగిలిన పనులను రెండు రోజుల్లో పూర్తవుతాయని తెలిపారు. ప్రతిరోజూ లోక్ అదాలత్ లు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో 161 న్యాయ అక్షరాస్యత శిబిరాలు నిర్వహించామని, ఏడు కేసులలో న్యాయ సహాయం అందించామన్నారు. రెండవ శనివారం జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామని, చిత్తూరు జిల్లాలో నిర్వహించిన లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కరించడంతో సంతృప్తిగా వుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ కోర్టుల పరిధిలో ఎక్కువ కేసులు పరిష్కరించిన జడ్జిల ను అభినదించారు. ఈ సమావేశంలో ఆదనపు జిల్లా జడ్జి రమేష్, అదనపు జిల్లా జడ్జి అన్వర్ బాషా, ఫాక్స్ కోర్టు అదనపు జిల్లా జడ్జి శాంతి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ కరుణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేగా విశ్రాంత డిఎస్‌పి పోటీ



విశ్రాంత డిఎస్‌పికి వినతి పత్రం అందిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

ప్రజాశక్తి -పుంగనూరు: వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా విశ్రాంత డిఎస్‌పి సుకుమార్ పోటీ చేస్తున్నారని అ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు తెలిపారు. వాల్మీకి సంఘ సమావేశం పుంగనూరులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ 2024 ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలలో వాల్మీకులు రాష్ట్రమంతా పోటీ చేస్తామని చెప్పారని, అందులో భాగంగానే పుంగనూరులో వాల్మీకి సమస్యలపై అనేక రకాల పోరాటం చేసిన వ్యక్తి, ప్రముఖ క్రీడాకారుడిగా, అన్ని సామాజిక వర్గాల నుంచి సత్సంబంధాలు కలిగిన వ్యక్తిగా పుంగనూరు విశ్రాంత డిఎస్‌పి సుకుమార్ ఎన్నికలలో పోటీ చేస్తున్నారని తెలిపారు. వాల్మీకులకు జరిగిన అన్యాయాన్ని 2024 సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రమంతా నిలబడి వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణతో పాటు బహుజనల హక్కుల సాధన, శ్రీరామ రాజ్య స్థాపన, సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా ముందుకు పోతామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకుల పేదలందరినీ మద్దతుతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలలో పోటీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వాల్మీకి అభ్యర్థికి మద్దతు తెలిపిన పుంగనూరు వాల్మీకి బంధు మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. పుంగనూరు వాల్మీకి వర్గానికి చెందిన వ్యక్తి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్న సుకుమార్ విజయానికి కృషి చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ సలహాదారుడు గంపల గంగరాజు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బొమ్మనపల్లి లక్ష్మన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సద్దల జయసింహ , వలసల మంజునాథ్, సూరన్న, వెంకటరమణ, కంచర్ల నరసింహులు, సర్వ నిర్మలమ్మ, మల్లికార్జున, కృష్ణప్ప పాల్గొన్నారు.

వేసవి తాపం తీరే దారేది?


శీతల పానీయం తాగుతున్న వానరం

ప్రజాశక్తి -బంగారుపాలెం: ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరిగి వేసవి తాపం ఎక్కువ కావడంతో మనుషులే కాదు.. పశుపక్షాదులు వేసవి తాపం తగ్గించుకునేందుకు శీతల పానీయాలు తాగుతున్నాయి. మండలంలోని తుంబ కుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఓ ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సభ ప్రాంగణంలో ఉంచిన శీతలపాలయాన్ని ఓ వానరం లాక్కుని చెట్టు ఎక్కి శీతల పానీయాన్ని మొత్తం తాగి సేద తీరింది. దీన్ని గమనిస్తున్న ప్రజలు 'వానరానికి దాహం ఎక్కువైందా?' అని నిశ్చేష్టులయ్యారు.

సర్పంచ్ టిడిపిలో చేరిక


టిడిపిలో చేరిన సర్పంచ్ కార్తీక్‌రెడ్డి

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని యనమల మంద పంచాయతీ లో కార్తీక్ రెడ్డి తండ్రి త్రిమూర్తిరెడ్డి, అతని అనుచరులు కృష్ణారెడ్డి, 100 మంది వైసిపి నుంచి నియోజక వర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టరు వియంథామస్ సమక్షం లో ఆదివారం టిడిపి లో చేరారు. ఆళ్లమడుగు యనమ ల మంద పంచాయతీలలో 'బాబు ష్యూరిటీ– భవిష్యత్తు గ్యారెంటీ'ని తెలుగు తమ్ముళ్లు ఎన్ఆర్ఐ మీడియా కోఆర్డినేటర్ గురుశాల కిషన్ చంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 'మన ఇంటికి మన థామస్' కార్యక్రమానికి విఎం థామస్ హాజరయ్యారు. ఆయన తెలుగు తమ్ముళ్లతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కార్తీక్ రెడ్డి, తండ్రి త్రిమూర్తిరెడ్డి తన అనుచరులతో సుమారు 100 మందితో కలిసి టిడిపిలో చేరారు. వి.ఎం థామస్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వెదురుకుప్పం క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్ మురళి, పచ్చికాపల్లం క్లస్టర్ ఇన్‌ఛార్జి చంగల్ రాయల్ రెడ్డి, నాయకులు భాస్కర్ నాయుడు, నాగరాజ రెడ్డి పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి , బల్ల , చెల్దిగాని పల్లి గ్రామ పంచాయతీలలో తెలుగు యువత సమావేశం ఆదివారం నిర్వహించారు. టిడిపి తెలుగు యువత అధ్యక్ష, కార్యదర్శి విశ్వనాథ్, వెంకటాచలం మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. అధికారం చేపడితే 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తారని, ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు.



పోలీసుల కవాతు

ప్రజాశక్తి -శాంతిపురం: శాంతిపురం మండల కేంద్రంలో ఆర్మీ బలగాలతో ర్యాలీని రాళ్ళబూదుగురు ఎస్సై సుమన్ నేతృత్వంలో ఆదివారం శాంతిపురం మండల కార్యాలయం నుండి బడుమాకులపల్లి సొంత వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధులలో సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వి సుమన్ మాట్లాడుతూ ఎన్నికల జరగనున్న సందర్భంగా ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ఆర్మీ బలగాలతో ర్యాలీని నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాల్సి ఉంటుదని, ఈ నిబంధనలో సహకరించాలని తెలిపారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బలగాలు, రాళ్ళబూదుగూరు పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

కందూరు గంగ జాతర ప్రారంభం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామ చావిడి వద్ద గంగమ్మ వారి విగ్రహ ప్రతిష్టతో గ్రామంలో గంగ జాతర వేడుకలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. గత ఆదివారం అమ్మవారి గంగ జాతర నిర్వహణకు గ్రామ పెద్దలు గ్రామ చావిడి వద్ద సమావేశమై చాటింపు వేయించారు. అటు తర్వాత కందూరు గ్రామ పరిసర ప్రాంతాలలో దున్నపోతును, చల్ల కడవలను మేళతాళాలతో వారం రోజులపాటు ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం గ్రామం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. అమ్మవారి మట్టి విగ్రహాన్ని తయారుచేసి ప్రత్యేక పూజలు చేశారు.

కార్చిచ్చుకు కాలుతున్న అడవులు

బుగ్గి పాలవుతున్న విలువైన అటవీ సంపద - నిద్రావస్థలో అటవీ అధికారులు

ప్రజాశక్తి - సోమల: సోమల మండలం అనగానే వేల ఎకరాల అటవీ భూములు, అడవుల్లో విలువైన వృక్ష సంపద, కనువిందు చేసే ప్రకృతి అందాలు, కిలకిల రావాలతో పక్షులు, ఎన్నో జంతువులు చల్లటి వాతావరణంతో జీవించేందుకు అనువైన ప్రదేశం గా పెద్దలు చెబుతూ ఉంటారు. అలాంటి విలువైన అటవీ సంపద కలిగిన బోనమంద, పేటూరు, అన్నెమ్మ గారి పల్లి, పెద్ద ఉప్పరపల్లి, ఆవులపల్లి, ఇరికిపెంట, 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీల పరిధిలోని అటవీ సంపద 20 రోజులుగా ఆకతాయిల అవగాహనా రాహిత్యం కారణంగా అటవీ సంపదకు నిప్పు పెట్టి అడవులను బుగ్గిపాలు చేస్తున్నారు. ఎన్నో జంతువులు, వృక్షాలు, పశువులకు మేతగా ఉపయోగపడే గడ్డి అగ్నికి ఆహుతి అవుతున్నాయి. అడవులకు అగ్గిపెట్టి బుగ్గిపాలు చేయడం వల్ల మానవులకు, భవిష్యత్తు తరాల వారికి కలిగే నష్టం పై అవగాహన కల్పించాల్సిన అటవీ శాఖ వారు నిద్రావస్థలో వుండడంతో నిత్యం ఏదో ఒక చోట అటవీ సంపద అగ్నికి ఆహుతై కార్చిచ్చుకు కాలిపోతోంది. గతంలో కళారూపాల ద్వారా గోడ పత్రికల ద్వారా మైకుల ద్వారా అటవీ సంపద అగ్నికి ఆహుతి కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అటవీ శాఖ ప్రచారం నిర్వహిస్తూ వచ్చేది. అయితే ఇటీవల కాలంలో ఆ ఆచారానికి స్వస్తి పలికి అటవీ సంపద బుగ్గిపాలు అవుతున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తూ ఉండడంపై మండల ప్రజలు ఆ శాఖ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బోనమంద, పేటూరు ప్రాంతంలో వందల వేల ఎకరాలలో వెదురు పొదలు విస్తరించాయి. ఈ ప్రాంతంలో ఆకతాయిల చేష్టల వల్ల అగ్నికి వెదురు పొదలు పూర్తిగా ఆహుతై బీళ్లుగా మారుతున్నాయి. ఇకనైనా అటవీ శాఖాధికారులు విలువైన అటవీ సంపద అగ్నికి ఆహుతి కాకుండా అటవీ సమీప గ్రామ ప్రజలకు మండల ప్రజలకు అవగాహన కల్పించాల్సి వుంది. భవిష్యత్తు తరాలు అటవీ సంపద కోల్పోతే ఎంత నష్టపోతారన్న విషయాన్ని ప్రజలకు తెలిపి అడవులు కాలిపోకుండా విలువైన సంపద బుగ్గిపాలు కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.


అగ్నికి ఆహుతవుతున్న వెదురు పొదలు

పాతగుంటలో దొంగలు హల్ చల్..!

-మొన్న టిప్పర్‌లో బ్యాటరీలు చోరీ - నిన్న ద్విచక్ర వాహనం అపహరణ

ప్రజాశక్తి -వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజక వర్గం పరిధిలోని వెదురుకుప్పం మండలం పాత గుంటలో రెండు రోజులుగా దొంగలు (గుర్తుతెలియని వ్యక్తులు)హల్ చల్ చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. శుక్రవారం రాత్రి పాతగుంటలో దొంగలు పడి వైసిపి నేత జిగిని మునికృష్ణారెడ్డికి చెందిన టిప్పర్‌కు ఉన్న రెండు బ్యాటరీలు చోరీ చేశారు. ఆ విషయం మరువకముందే శనివారం రాత్రి చుక్కలింగారెడ్డి కుమారుడు రాజేష్‌కు చెందిన పల్సర్ బైక్ అపహరణకు గురైంది. దీంతో స్థానికులు కంటి మీద కునుకు లేకుండా బిక్కుబిక్కుమని గడుపుతున్నారు. పోలీసులు దీనిపై దృష్టి పెట్టి దొంగల ఆట కట్టాల్సి వుంది.

గడ్డివామి దగ్ధం

రూ.20వేలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి -పుంగనూరు: ఉన్నట్లుండి హఠాత్తుగా మంటలు చెలరేగి గడ్డివామి దగ్ధమై 20 వేలు రూపాయలు ఆస్తి నష్టం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారి ఎస్ సుబ్బరాజు తెలిపారు. అగ్నిమాపక కేంద్ర పరిధిలో పుంగనూరు మండలం ఇదియత్ నగర్, అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్ కు ఎదురుగా ఆదివారం ఈ ప్రమాదం సంభవించింది. అగ్ని ప్రమాదం సంగతి తెలిసిన వెంటనే సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని బాధితుడు సి.రెడ్డప్పకు చెందిన వరిగడ్డి వామి మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు 20 వేలు రూపాయలు మేర ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని అంచనా వేశారు. చుట్టుపక్కల నివాస గృహాలు, గడ్డివాములు వున్నాయని మంటలు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని అగ్ని మాపక అధికారులు పేర్కొన్నారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి ఆర్పివేయకుండా పార వేయడంతో ఈ ప్రమాదం సంభవించి వుండొచ్చని వారు అను మానం వ్యక్తం చేశారు. ఈ అగ్ని ప్రమాదం లో పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక అధికారులు

చంద్రబాబు దళితులకు క్షమాపణ చెప్పాలి

- దళిత సంఘాల నిరసన

ప్రజాశక్తి -పుంగనూరు: సింగనమల నియోజకవర్గం నుంచి తమ దళిత బిడ్డ ట్రక్ డ్రైవర్ గా పనిచేస్తున్న వీరాంజనేయులు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తుంటే చంద్రబాబు నాయుడు అవమానకరంగా మాట్లాడడం తమ సామాజికి వర్గాన్ని అవమాన పరిచేలా వుందని దళిత సంఘాలకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. నియోజకవర్గ కేంద్రం లో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో ఆదివారం చంద్రబాబు మాట్లాడిన మాటలకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాట్లాడుతూ సింగన మల నియోజకవర్గం నుండి సాధారణ ట్రక్ డ్రైవర్ దళితకులానికి చెందిన వీరాంజనేయులుకు వైసిపి దళిత పక్షపాతి సీఎం జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్యే టికెట్ అందించారని దీనిపై శనివారం నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు నాయుడు చులకన చేసి కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సమంజసంగా లేదన్నారు. దళిత సంఘాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డి నేడు దళిత ట్రక్ డ్రైవర్ అయిన సాధారణ వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వడం ఓర్వలేక నోటికి వచ్చిన విధంగా దళితులను అవమాన పరుస్తూ మాట్లాడడంపై దళిత సంఘాలు రాష్ట్ర స్థాయిలో మండిపడు తున్నాయన్నారు. దళిత సంఘాలకు వెంట నే చంద్రబాబు క్షమాపణ చెప్పాలని ఇక ముందు ఆయన నోటి వెంట ఇలా వ్యాఖ్యలు చేస్తే సహించబోమని, గ్రామాల్లో సైతం పర్యటనను అడ్డు కుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ సదుం మండల కన్వీనర్ ఎం సీతాపతి, దళిత నాయకులు రాజా, పెంచుపల్లి కృష్ణప్ప, కుమార్ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

క్రైం న్యూస్

లారీని ఢీకొన్న కారు

- మహిళకు గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ లక్ష్మి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో మహిళకు గాయాలైన సంఘటన మండలంలోని అరగొండ ఫ్లైఓవర్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. సీఐ లక్ష్మయ్య కథనం మేరకు...పలమనేరు నుండి చెన్నై వెళుతున్న లారీని బెంగళూరు నుండి చెన్నయ్ వైపు వెళుతున్న కారు అతివేగాన్ని నియంత్రించలేక లారీ వెనక భాగంలో ఢీకొంది. ఈ సంఘటనలో చెన్నయ్‌కు చెందిన లక్ష్మీకి తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న వారి కుమారులు విశ్వజిత్ , రేవంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారికి బంగారు పాలెం ప్రజా వైద్యశాలలో ప్రథమ చికిత్స చేపట్టి మెరుగైన చికిత్స కోసం రాణి పేట సిఎంసికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-గంగవరం: గంగవరం మండలం చిన్నూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గంగవరం పంచాయతీకి చెందిన చిన్నూరు, రొంటకుంట్ల, మన్నాయనపల్లి, నడింపల్లి, డ్రైవర్స్ కాలనీ, కీలపట్ల పంచాయతీకి చెందిన నలసానిపల్లి గ్రామాలకు సంబంధించి టిడిపి , జనసేనలకు చెందిన సుమారు 70 కుటుంబాలకు వైసిపిలో చేరారు. వైసిపి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసిపిలో చేరామని వారు తెలిపారు. వైసిపిలో చేరిన వారికి ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆహ్వానం పలికారు.


ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైసిపిలో చేరుతున్న టిడిపి కార్యకర్తలు

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి, గొరివిమాకులపల్లి , పంచాయతీ, కృష్ణానగర్ నగర్, చిన్న బల్దర్ కు చెందిన పలువురు టిడిపి కార్యకర్తలు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కుప్పం నియోజకవర్గంలో భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు వివరించి చైతన్యం తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ బాబు రెడ్డి, సర్పంచ్లు మురళి, అశోక్ ,కో కన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి ,బోర్వెల్ చంద్రశేఖర్ రెడ్డి , మార్కెట్ యార్డ్ డైరెక్టర్ హేమ చలపతి , సతీష్ పాల్గొన్నారు.


బోయకొండ గంగమ్మ ఆలయానికి తాళి బొట్టు వితరణ చేస్తున్న దాతలు

గంగమ్మకు బంగారం తాళిబొట్టు బహూకరణ

- కుర్చీలు బల్లలు వితరణ

ప్రజాశక్తి -చౌడేపల్లి: బోయ కొండ గంగమ్మ ఆలయానికి పలువురు భక్తులు విరాళాలు అందించారు. హైదరా బాదు కు చెందిన హారిక షరాజన్ లక్ష రూపాయలు విలువ చేసే 40 స్టీలు టేబుళ్లు, 100 కుర్చీలు, మహాలక్ష్మి, సౌజన్య రెడ్డిలు అమ్మ వారికి రూ.50 వేలు విలువ చేసే బంగారు తాళిబొట్టు, వెండి మెట్లు విరాళంగా అందించారు. ఆలయ ఛైర్మన్ నాగరాజు రెడ్డి, ఈవో చంద్రమౌళిలు వారికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు.


ఉద్యోగ విరమణ పొందిన షమ్మీ మునిషబేగంను సన్మానిస్తున్న దృశ్యం

'విధుల నిర్వహణలో గుర్తింపు పొందాలి'

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: విధులు నిర్వహణ సమయంలో సంఘంలో గుర్తింపు పొందాలని డాక్టర్ లోహిత్ చెంగల్ రాయు లు అన్నారు. మండలంలోని తుంబకుప్పం ప్రాథమిక వైద్య కేంద్రంలో సిహెచ్‌ఓ షమ్మీ మునిస బేగం ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ లోహిత్ చంగల్ రాయలు మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తగా ఉద్యోగం ప్రారంభించి గడిచిన 39 సంవత్సరాలు అంచలంచెలుగా ఉద్యోగోన్నతి పొంది సిహెచ్‌వోగా విరమణ పొందడం ఆశించదగ్గ విషయమని విధి నిర్వహణలో సంఘంలో గుర్తింపు పొందాలని సూచించారు. అనంతరం సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రమేష్, లోకేష్, డిపిఎంఓ మనీ, సూపరువైజరు హరికృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు జాగ్రత్తలు అవసరం

- సురేఖ, వైద్యాధికారి పచ్చికాపల్లం, వెదురుకుప్పం



ప్రజాశక్తి -వెదురుకుప్పం : ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, మండల వాసులు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో, వెదురుకుప్పం, మండలం, పచ్చికాపల్లం ప్రాథమిక వైద్య అధికారి డాక్టర్ సురేఖ పేర్కొన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉదయం బయటకు వెళ్లేటప్పుడు నెత్తికి టోపి పెట్టుకోవాలని, లేదా రుమాలు కట్టుకోవాలని, తెలుపురంగు గల కాటన్ వస్త్రాలను ధరించాలని సూచించారు. కళ్ళ రక్షణ కోసం సన్ గ్లాసెలు ఉపయోగించాలన్నారు. వీలైనంత వరకు ఇంట్లో ఉండటానికి ప్రయత్నించండి. దాహం వేయకపోయిన తరుచుగా నీటిని తాగాలని పేర్కొన్నారు.

- ఉప్పుకలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓ ఆర్ యస్ కలిపిన నీటిని తాగవచ్చును.
- వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రాకుంటే, దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి
- ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీరు గాని , నిమ్మరసంగాని, కొబ్బరినీరు గాని తాగాలి.
- తీవ్రమైన ఎండలో బయటికి వెళ్ళినప్పుడు తలతిరుగుట, వాంతులు ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని వైద్యుణ్ణి సంప్రదించాలి
- ఇంటి వాతావరణం చల్లగా ఉంచుకోవాలి. ఫ్యాను వాడండి. చల్లని నీరుతో స్నానం చేయాలి.
- తక్కువ ఖర్చుతో కూడిన చల్లదనం కోసం ఇంటిపై కప్పులపై వైట్ పెయింట్, కూల్ రూఫ్ టెక్నాలజీ, క్రాస్ వెంటిలేషన్, థర్మోకోల్ ఇన్సులేషన్ ను ఉపయోగించాలి.
- మేడపైన మొక్కలు, ఇంట్లో ని మొక్కలు (ఇండోర్ ప్లాంట్స్) భవనాన్ని చల్లగా ఉంచుతాయి. ఉష్ణతాపాన్ని తగ్గిస్తాయి.

ఎండ తీవ్రతంగా ఉన్నప్పుడు చేయకూడనివి..

- ఎండలో గొడుగు లేకుండా తిరగరాదు. వేసవి కాలంలో నలుపురంగు, మందంగా ఉండే దుస్తులు ధరించరాదు.
- మధ్యాహ్నం తరువాత (మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 3గంటల మధ్యకాలంలో) బయట ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనిచేయరాదు.
- బాలింతలు,చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు బయట తిరగరాదు. వీరిపై ఎండ ప్రభావం త్వరగా చూపే అవకాశం ఉంది.
- శరీరాన్ని డీహైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ కార్బోనేటేడ్ శీతల పానీయాలు మానుకోండి. అధిక ప్రోటీన్, ఉప్పు, కారం, నూనె ఉండే పదార్థాలు తీసుకోవద్దు.
- ప్రకాశించే లైట్ బల్బులను వాడటం మానుకోండి, అవి అనవసరమైన వేడిని విడుదల చేస్తాయి.
- ఎండలో నుంచి వచ్చిన వెంటనే తేనె వంటి తీపిపదార్థాలు తీసుకోకూడదు.
- శీతలపానీయాలు, ఐస్ వంటివి తీసుకుంటే అనారోగ్యం ఏర్పడుతుంది.
- ఎండ ఎక్కువగా వున్న సమయంలో వంట చేయకుండా ఉండాలి. వంట గది తలుపులు, కిటికీలను తీసివుంచి తగినంత గాలి వచ్చేలా చూసుకోవాలి.
- వడ దెబ్బకు గురైన వారిని వేడి నీటిలో ముంచిన గుడ్డతో తుడువరాదు. దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేర్చుటలో ఏ మాత్రం ఆలస్యం చేయకూడదు.

తగు జాగ్రత్తలు తీసుకుంటూ .. తగినన్ని నీళ్ల తాగితే ఈ వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని ఆమె తెలిపారు

పూతలపట్టు వైసిపిలో ఆందోళన!

- వైసీపీ రెబల్ అభ్యర్థిగా పోటీకి సిద్ధమవుతున్న రమాదేవి



ప్రజాశక్తి -తవణంపల్లి: పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన స్థానిక మహిళగా, తాను 14 ఏళ్లుగా వైసిపికి సేవ చేశానని, మహిళ అనే కారణంతో పార్టీలోని కొన్ని శక్తులు తనకు టికెట్ నిరాకరించాయని స్థానిక సీనియర్ మహిళా నాయకురాలు రమాదేవి ఆరోపించారు. ఈ సందర్భంగా తవణంపల్లి మండలం ఉత్తర బ్రాహ్మణపల్లి గ్రామంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. తమకు తీరని అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లుగా టికెట్ కోసం ఎదురుచూస్తున్నానని, పార్టీ సీనియర్ నేతలు తన ప్రొఫైల్ అధిష్టానం దృష్టికి వెళ్లకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు మండలాల్లో కుటుంబ సభ్యులు, అనుచరుల మద్దతుతో వైసీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆమె తెలిపారు. నియోజకవర్గంలో గ్రామస్థాయిలో బంధువుల బృందం, వారి అభిమానులు ఉన్నారని ఆమె తెలిపారు. నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థులుగా మహిళలు పోటీ చేయకుండా కొందరు సీనియర్ నేతలు అడ్డుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలవాలని కోరినప్పుడు నియోజకవర్గానికి సంబంధం లేని కొత్త వ్యక్తి ఎం.ఎం. బాబుకు అవకాశం ఇచ్చారు. పూతలపట్టు నియోజకవర్గంలో మహిళల సహకారంతో విజయావకాశాలు న్నాయన్నారు.

వాలంటీర్లు రాజీనామా చేయాల్సిన అవసరం లేదు

చిత్తూరు నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జగన్ రెడ్డి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పెన్షన్ లను నిలిపివేసిందని చిత్తూరు నియోజకవర్గ టిడిపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం టిడిపి ఉమ్మడి ముఖ్య నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ మార్చి నెల 30 , 31 తేదీలలో బ్యాంకులకు సెలవులని తెలిసీ ముందే డబ్బులు డ్రా చెయ్యలేదన్నారు. పెన్షన్ డబ్బు బినామీ కాంట్రాక్టర్లకు దోచి పెట్టి, వలంటీర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి, ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ఆదేశాలు కూడా బేఖాతరు చేస్తూ వాలంటీర్లను వైసిపి ప్రభుత్వ పెద్దలు , నేతలు దుష్ప్రచారం చేయమంటున్నారని ఆయన విమర్శించారు. వాలంటీర్ల వ్యవస్థకు సంబంధించి అప్పట్లోనే చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని అయితే చివరి క్షణంలో ప్రభుత్వం మారడంతో ఆ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే పనే వాలంటీర్లేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు అయితే కొంతమంది మంత్రులు , వైసిపి నేతలు వాలంటీర్లను తమ కార్యకర్తలుగా మార్చుకుంటూ వారి చేత వెట్టిచాకిరి పనులు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. వైసిపి పెద్దల మాటలు వినని వాలంటీర్లపై లేనిపోని ఫిర్యాదులు చేసి మీ ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరించడం ఇతర అక్రమ కేసులు పెడతామని భయాందోళనకు గురిచేయడం వంటివి మంచి పద్ధతి కాదన్నారు. రానున్న రోజుల్లో టిడిపి ప్రభుత్వ హయాంలో వారి ఉద్యోగాలకు మరింత భరోసా కల్పిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు తీసుకు వస్తారని ఆయన అన్నారు. వాలంటీర్లు ఎవరు వైసీపీ నేతలకు కార్పొరేటర్లకు భయపడాల్సిన అవసరం లేదని నిజాయితీగా పనిచేయాలని ఆయన సూచించారు. కొన్నిచోట్ల వాలంటీర్లను బలవంతంగా రాజీనామాలు చేయించి వైసిపి నేతలు వైసిపి కార్యకర్తలుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే నెలకు 20 వేల నుంచి 30 వేల రూపాయల వరకు జీతభత్యాలు ఇస్తామంటూ ఎరవేస్తున్నారని , వైసీపీ నేతల తీరు మారకపోతే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జనసేన నేతలు దయారాం యశ్వంత్, నేతలు అట్లూరి శ్రీనివాసులు చిట్టిబాబు టిడిపి నేతలు వైవి రాజేశ్వరి , వరుణ్ కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్